చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుశాంత్

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పీసా చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సమతా సంస్థ డైరెక్టర్ సుశాంత్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని పీసా కమిటీ సభ్యులకు శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఈ గిరిజన ప్రాంతంలో ఉన్నటువంటి అపార ఖనిజ సంపదతో పాటు అటవీ ప్రాంతంలో లభించే అన్ని ఉత్పత్తులపైన గిరిజనులకే సర్వాధికారాలున్నాయన్నారు. గిరి గ్రామాల్లో ఏ ఒక్క సంపదను తరిలించాలన్నా గ్రామ కమిటీ తీర్మాణం తప్పనిసరి అన్నారు. చట్టాలను పక్కాగా నెరవేర్చే దిశగా పీసా కమిటీలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా సంస్థ కో–ఆర్డినేటర్ సతీష్, వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిట్టిబాబు, గంగరాజులు మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు


ప్రిన్సిపాల్ రమణారావు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ఏకలవ్య (ఈఎంఆర్) పాఠశాలలో మిగుల సీట్ల భర్తీకి సంబంధించి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. ఈ నెల 30లోగా సంబంధిత పాఠశాలలు లేదా ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బహుమతి అందజేస్తున్న జమాల్‌ఖాన్

వి.ఆర్.పురం; క్రీడలు మానసిక ఉల్లాసనికి దోహదపడతాయని, యువత ఆటపాటల్లో రాణించాలని ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్ అన్నారు. మండలంలో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో ఫైనల్‌లో గెలుపొందిన వి.ఆర్.పురం జట్టుకు ప్రథమ బహుమతిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటగాళ్ల క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. పవన్, అభి, తిరుమల రాజా, రాజు, వంశీ, ఉదయ్ కిరణ్, ఆది, శ్రీరామగిరి ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్ రావు, చంద్రశేఖర్, సూరిబాబు పాల్గొన్నారు.

సంత ఆశీలు వేలం పాట రేపు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఈనెల 12న వారపు సంత ఆశీలు వసూలు వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆశీల వేలం పాట జరుగుతుందని, ఇందులో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేయాలన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పాడేరు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12నుంచి నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజు వరుసగా ఉదయం, మధ్యాహ్నం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు, సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలన్నారు, పాడేరు జిల్లా కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారి పండుగ ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులు ట్రాఫిక్ నియంత్రించడంలో భాగంగా పోలీసులు ఒకవేళ అనుమతించకపోతే హాల్‌టికెట్‌లు చూపించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు


ఉమానీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


అరకు ఎంపీ తనూజరాణికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: మండల కేంద్రలోని కైలాస క్షేత్రంలోని నవగ్రహాలకు భక్తులు శనివారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. శని త్రయోదశితో నవగ్రహాలకు తైలాభిషేకం, పంచామృతాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల రామం పూజలు జరిపించారు. అనంతరం ఉమానీలకంఠేశ్వరస్వామి, రాజరాజేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలోని నవగ్రహాలతో పాటు ఉమానీలకంఠేశ్వరస్వామిని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ తనూజరాణిని ఆలయ అర్చకుడు ఉప్పల రామం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నంలు సన్మానించారు. ఉమా నీలకంఠేశ్వరస్వామి ఫోటోతో పాటు ప్రసాదాలను పంపిణీ చేశారు. అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చింతపల్లి: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఈనెల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పరమేశ్వరం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18వ తేదీలోగా గురుకులం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20న మెరిట్ జాబితా విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. మొదట, రెండవ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. బాలురు పెదబయలు, జి.మాడుగులు, కొయ్యూరు, చింతపల్లిలోను, బాలికలు అరుకు, గూడెం కొత్తవీధి, పాడేరు కళాశాలలోను ప్రవేశాలకు ఎంపిక చేసుకోవచ్చునన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ,ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిన్నారులకు మంచి అలవాట్లు నేర్పాలి


వేడుకలో పాల్గొన్న మహిళలు

కొయ్యూరు: తల్లులు తమ పిల్లలకు చిన్నప్పట్నుంచి మంచి అలవాట్లను నేర్పాలని సీడీపీవో విజయ కుమారి సూచించారు. మదర్స్‌డే సందర్భంగా కొయ్యూరులో చిన్నారుల తల్లులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ పెద్దలను గౌరవించడం, వారి పాదాలకు నమస్కరించడం వంటి అలవాట్లను చిన్నారులకు నేర్పించాలని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలని సూచించారు. పిల్లలకు బొమ్మలు వేయడం నేర్పించి వాటికి రంగులు వేయించారు. మహిళా సంరక్షణ అధికారులు, సూపర్‌వైజర్లు, రాజన్నదొర పాల్గొన్నారు.

మోతగూడెం ఎస్ఐగా సాధిక్ నియామకం



మోతుగూడెం: మోతుగూడెం ఎస్ఐగా ఎస్‌కె సాధిక్ నియమితులైయ్యారు. మారేడుమిల్లి ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై మోతుగూడెం ఎస్ఐగా నియమితులైయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్ఐ పనిచేస్తున్న శివన్నారాయణ రైల్వే ఎస్ఐగా బదిలీ అయ్యారు.















రారండోయ్ జాతర చూద్దాం

- మోదకొండమ్మ తల్లి అమ్మవారి ఉత్సవానికి సర్వం సిద్ధం
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు


విద్యుత్ దీపాలంకరణలో ఆలయం సెట్టింగ్


ఎగ్జిబిషన్ వద్ద భద్రతా ఏర్పాట్లు జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్‌పటేల్


ఆకట్టుకుంటున్న హోర్డింగ్‌లు

సాక్షి, పాడేరు: లక్షలాది మంది భక్తుల కల్పవల్లి మోదకొండమ్మ తల్లి జాతరకు పాడేరు పట్టణం ముస్తాబైంది. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. మోదమ్మ ఉత్సవాలు గిరిజన జాతరగాను గుర్తింపు పొందాయి. ఈ ఏడాది పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కావడంతో అమ్మవారి ఉత్సవాలకు మరింత ప్రాధాన్యత నెలకొంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచే మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మంగళవారం వరకు మూడు రోజుల పాటు అత్యంత ఘనంగా ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఉత్సవ, ఆలయ కమిటీతో పాటు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి ఆలయంతో పాటు మెయిన్‌రోడ్డులోని సతకం పట్టు వద్ద మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలకు భక్తులు పూజలు చేస్తారు. ఉత్సవాల చివరిరోజు మంగళవారం మోదకొండమ్మతల్లి ఘటాల అనుపోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. వేడుకల్లో రాత్రిళ్లు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను అలరించనున్నాయి. కాలేజీ మైదానంలో భారీ ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ భక్తుల సహకారంతో అన్న ప్రసాదాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ భక్తులకు తాగునీటి సౌకర్యాలు కల్పిస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది.

ఉత్సవాలు విజయవంతం చేయాలి

- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సాక్షి,పాడేరు: పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఉత్సవ,ఆలయ కమిటీ అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఈ ఏడాది మోదమ్మ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశామన్నారు.అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉచిత భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు. సురక్షిత తాగునీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులంతా ఎంతో శ్రమిస్తున్నారన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

మోదమ్మ ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

మోదమ్మ ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

- మోదకొండమ్మతల్లికి ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు జరుగుతాయి.
- అమ్మవారి తొలిపూజ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, శివరత్నం దంపతులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలోప్రారంభం.
- అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, జేసీ అభిషేక్‌గౌడ, జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధర్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు, అన్ని వర్గాల భక్తులు హాజరవుతారు.
- ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అధికారుల సమక్షంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఊరేగింపు.
- ఆలయం నుంచి పాడేరు మెయిన్‌రోడ్డు వరకు మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాల ఉరేగింపు
- మెయిన్‌రోడ్డు సతకంపట్టు వద్ద ఉదయం 9 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను కొలువుదీర్చి ఉత్సవాల ప్రారంభం.
- మోదకొండమ్మతల్లి ఆలయం, సతకంపట్టు వద్ద రాత్రి వరకు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- ఉదయం 10గంటలకు ప్రభుత్వ పథకాల స్టాళ్ల ప్రారంభం.
- సాయంత్రం 4గంటల నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపు.
- రాత్రి 10గంటల నుంచి సినిమాహాల్ సెంటర్‌లో డాన్స్ బేబీ డాన్స్, మెయిన్‌రోడ్డు సతకం పట్టు వద్ద డాన్స్ హంగామా, పాతబస్టాండ్ వద్ద డాన్స్ బేబీ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు.









